







రామచంద్రపురంలో ఆటో నడుపుతున్న ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యేలు.. అమలాపురంలో ఆనందరావు, మురమళ్లలో బుచ్చిబాబు, పి గన్నవరంలో గిడ్డి సత్యనారాయణ, రావులపాలెంలో బండారు సత్యానందరావు, మలికిపురంలో దేవ వరప్రసాద్ ఆటో నడుపుతున్న దృశ్యం.. మండపేటలో చెక్కు పంపిణీ చేస్తున్న వేగుళ్ల జోగేశ్వరరావు

# 'ఆటో' జోష్!

## ఆటో డ్రైవర్ల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- 'ఆటో డ్రైవర్ల సేవలో..' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్
- కోనసీమ జిల్లావ్యాప్తంగా 7,709 మందికి రూ.11.56 కోట్లు
- నగదు పంపిణీని ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే ఆనందరావు
- ర్యాలీగా తరలివచ్చిన ఆటో కార్మికులు. జిల్లా అంతటా సందడే సందడి



ఆటోవాలాలకు రూ.కోటి 96 లక్షల చెక్కును విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, డీటీవో

అమలాపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రతీ ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ.15వేల వంతున ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. జిల్లాలో ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్, మోటారు క్యాబ్ డ్రైవర్లకు సుమారు జిల్లావ్యాప్తంగా 7709 మందికి రూ.11.56 కోట్లను జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో ఆటో కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమలాపురంలోని భట్నవిల్లి వద్ద జరిగిన ఆటో కార్మికుల సదస్సులో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ.15వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని డీబీటీ విధానంలో పంపిణీ చేస్తున్నట్టు ప్రకటించారు. అమలాపురం డివిజన్‌లోనే 13,600 మందికి ఈ లబ్ధిని అందించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభకు స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమాన్ని ప్రజల వద్దకు తీసుకువెళ్లడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న అవిశ్రాంత కృషి అభినందనీయమన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి ఈ ఆర్థిక సహాయాన్ని అందించడం కూటమి ప్రభుత్వం అందిస్తున్న గొప్ప నిర్ణయంగా పేర్కొన్నారు. ఒక పక్క సంక్షేమాన్ని కొనసాగిస్తూనే, మరోవైపు అమలాపురంలో రెండు వంతెనలు నిర్మించి భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఆటో కార్మికుల విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని వారికి అన్నివిధాలా సహకారం అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లా అన్ని రంగాల్లోను అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందన్నారు. ఈ సభలో జిల్లా రెవెన్యూ అధికారి కొత్త మాధవి, జిల్లా రవాణాశాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మహిళానేత పెచ్చెట్టి విజయలక్ష్మి, ఆటో యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కంచిపల్లి అబ్బులు, నియోజకవర్గానికి చెందిన టీడీపీ, జనసేన కీలక నేతలతో సహా వివిధ మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.కోటి 96 లక్షల చెక్కును నియోజకవర్గ ఆటో డ్రైవర్లకు ఎమ్మెల్యే, కలెక్టర్ చేతులమీదుగా అందజేశారు. అంతకుముందు పేరూరు వై.జంక్షన్ నుంచి ఆటో కార్మికులు భారీగా ర్యాలీ నిర్వహిస్తూ భట్నవిల్లి సెంటర్‌కు చేరుకున్నారు. చంద్రబాబు అందిస్తున్న సహకారానికి ఆటో కార్మికులతోపాటు నాయకులంతా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయిలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గస్థాయిలో ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఎంపీ, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో..

రామచంద్రపురంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో ఆటో కార్మికులకు సుమారు రూ.2 కోట్ల చెక్కును పంపిణీ చేశారు. అదేవిధంగా కొత్తపేటలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలోను, ముమ్మిడివరంలో దాట్ల బుచ్చిరాజు ఆధ్వర్యంలో, మండపేటలో వేగుళ్ల జోగేశ్వరరావు, పి.గన్నవరంలో గిడ్డి సత్యనారాయణ, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులకు నియోజకవర్గ స్థాయిలో చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. డీటీవో దేవిశెట్టి శ్రీనివాస్, మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీ, ఎమ్మెల్యేలు ఆటో డ్రైవర్ల డ్రెస్‌లో దర్శనమిచ్చి వారిని ఆకట్టుకున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఆటో కార్మికులు ర్యాలీలు, ఊరేగింపులు జరిపారు.




## చిన్నారులకు..
# మందులు..వద్దు!
## నలత చేసినా.. కలత పడొద్దు..

పిల్లలు ఒక్కసారి దగ్గినా, కొద్దిగా ముక్కు కారినా వెంటనే మందు వేసేయాల్సిందే. నెలా, రెండు నెలల వయసైనా ఇదే పద్ధతి. ఇది చాలా ప్రమాదమని వైద్యులు చెప్పినా వినిపించుకోని వాళ్లు చాలామంది ఉన్నారు. పసివాళ్లకు కాస్త నలత చేసిందంటే ఇంట్లో కలత మొదలవుతుంది. వాళ్లు నోరు తెరిచి చెప్పలేరు. పిల్లలకు జలుబు, దగ్గు, జ్వరం వంటి ఇన్ఫెక్షన్లు ఎలా వస్తాయో అలానే తగ్గిపోతాయని వైద్య నిపుణులు చెప్పే సత్యం. కానీ శరీరం సర్దుబాటు చేసుకునే సమయం ఇవ్వడమే ఇక్కడ కీలకాంశం. వాస్తవానికి కాఫ్ సిరప్‌లు పనిచేయడానికే నాలుగు రోజుల సమయం పడుతుందట. వాటికంటే ఆవిరి పడితే చాలావరకూ వేగంగా కోలుకుంటారని పిల్లల వైద్యులు చెబుతున్నారు. మధ్యప్రదేశ్‌లోని చిన్నారుల మరణం ప్రస్తుతం దేశాన్ని కుదిపేస్తోంది. రెండేళ్లలోపు పిల్లలకు దగ్గు, జలుబు మందులు వాడొద్దని కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- (రాజమహేంద్రవరం/గొల్లప్రోలు-ఆంధ్రజ్యోతి)

వాతావరణంలో వచ్చే మార్పుల కారణంగా రోగాలు వస్తుండడం సర్వసాధారణం. ఐదేళ్ల లోపు పిల్లలకు దగ్గు, జలుబు మందులు వాడాల్సిన అవసరం ఉండదు. వైరల్ ఇన్ఫెక్షన్లు కావడంతో మందులతో పెద్దగా ఫలితం ఉండదు. కానీ కొందరు డాక్టర్లు ఏవేవో కాంబినేషన్లతో కూడిన మందులు రాసేస్తారు. చాలామంది మందుల షాపు నుంచి కొనుక్కొని వాడేస్తుంటారు. ఇటీవలకాలంలో చిన్నారుల్లో మందుల వినియోగం గణనీయంగా పెరిగింది. మూడేళ్ల కిందటితో పోల్చుకుంటే చిన్నారుల మందుల విక్రయాలు దాదాపు 75 శాతం పెరిగినట్టు రికార్డులు చెబుతున్నాయి. ఇది ప్రమాదకర స్థితిని సూచిస్తోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఇటీవల పెద్దలు తాగే దగ్గు సిరప్‌ను చిన్నారులకు పట్టగా 11 మంది చనిపోయారు. జైపూర్‌కు చెందిన కేసన్స్ అనే సంస్థ తయారుచేసిన సిరప్ వల్ల ఈ మరణాలు సంభవించినట్టు గుర్తించారు. ఈ సిరప్‌లు నాణ్యతా లోపంతో ఉండడంతోపాటు చిన్నారులకు, పెద్దలకు ఒకే విధమైన సిరప్‌లను మార్కెట్‌లో ఉంచడంతో ప్రాణాపాయం ఏర్పడిందని పరీక్షల్లో తేలింది. ఈ నేపథ్యంలో కేంద్రం సూచనల మేరకు వైద్య- ఆరోగ్య శాఖ, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ అప్రమత్తమయ్యాయి.

### ఈ మందులు వాడితే ప్రమాదమే..

జలుబు, దగ్గు వంటి ఇన్ఫెక్షన్లకు డీకంజెస్టెంట్లు, యాంటీ హిస్టామైన్, డెక్స్ట్రామెథార్ఫన్ కాంబినేషన్ల మందులను డాక్టర్లు సిఫారసు చేస్తుంటారు. వాటివల్ల దారుణమైన ప్రతికూలతలు ఉన్నాయి. అవి నేరుగా మెదడుపై ప్రభావం చూపడంతో పిల్లలు మూర్ఛకు గురవుతారు. మగతగా ఉంటారు. గుండె కొట్టుకొనే వేగం పెరిగి మరణానికి దారి తీస్తుంది. మల విసర్జితానికి ఇబ్బంది కలుగుతుంది. పిల్లలు చిరాకు, ఆందోళనగా ఉండి నీరసించి పోతారు. డెక్స్ట్రామెథార్ఫన్, గుఫెనీసిన్ వల్ల ఎక్కువగా అలా జరుగుతుంది. కానీ మనం రోగం పెరుగుతున్నా తగ్గుతోందని అనుకొని ఆ మందులనే బలవంతంగా పట్టించేస్తాం.

### దగ్గు వస్తే ఇలా చేసి చూడండి..

రెండేళ్లలోపు వయసున్న చిన్నారుల్లో జలుబు, దగ్గు వచ్చినా మందులు ఇవ్వడం కానీ, సూచించడం కానీ చేయవద్దని కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీచేసింది. ఎలాంటి మందులు వాడకుండానే దగ్గు తగ్గిపోయే అవకాశాలే అధికంగా ఉంటాయని కేంద్రం తెలిపింది. పిల్లలకు దగ్గు, జలుబు, జ్వరం వంటివి సోకితే తగిన విశ్రాంతి ఇవ్వాలి. శరీరంలో సహజంగా ఉండే వ్యాధి నిరోధక శక్తి ఇన్ఫెక్షన్‌పై దండెత్తి తరిమి కొట్టే సమయం ఇవ్వాలి. గోరు వెచ్చని ద్రవాలను వైద్యుడి సలహాతో పట్టించవచ్చు. 12 నెలల కంటే ఎక్కువ వయసు పిల్లలకు నిద్ర సమయానికి ఓ అర గంట ముందు కొద్దిగా తేనె కలిపిన గోరువెచ్చని నీళ్ల పట్టించడం వల్ల దగ్గు నుంచి ఉపశమనం లభిస్తుంది. మూడు రోజులు చూసిన తరువాత చిన్నారుల్లో వచ్చే దగ్గు, రొంప తదితర వ్యాధులకు వైద్యులను సంప్రదించాలి. వెంటనే అవసరం ఉండదు.

- మితిమీరిన మందులు హానికరమే
- దగ్గు, జలుబు సిరప్‌ల వల్ల నష్టాలు ఎక్కువే
- రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో 11 మంది మృతి
- పిల్లలకు మందులు వద్దని కేంద్రం ఆదేశం
- పెద్దల మందులు వాడేసినా ప్రమాదమే



### ఇలా వాడొద్దు..

చిన్నారుల్లో జ్వరం, దగ్గు, జలుబు, విరేచనాలు, వాంతులు ఎక్కువగా వస్తుంటాయి. ప్రతి నెలా చిన్నారులను వైద్యులు వద్దకు తీసుకెళితే వారి ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా మందులు మార్పు చేస్తారు. అలా చేయకుండా ఒకే రకమైన మందులను రెండు, మూడేళ్ల వరకు వినియోగిస్తున్నారు. డ్రాప్స్ స్థానంలో పీడియాట్రిక్ సిరప్‌లు, అవి అందుబాటులో లేకుంటే పెద్దల సిరప్‌లు వినియోగించే వారు అధికం.లేకుంటే మెడికల్ షాపులు, ఆర్ఎంపీల వద్దకు వెళ్లి వారు సూచించిన మందులను వాడేస్తున్నారు. ఇప్పుడు ఇదే ప్రమాదకరంగా మారింది. దగ్గు, రొంప, జ్వరం వచ్చినప్పుడు ఆరేళ్లలోపు చిన్నారులకు పెద్దల మందులను డోస్ తగ్గించి వాడితే సరిపోతుందనే భావన సరికాదు. చిన్నారులు, పెద్దలు ఎవరైనా సరే వైద్యులు సూచించిన మోతాదులోనే మందులను వినియోగించాలి.

### సెల్ఫ్ మెడికేషన్ ప్రమాదకరం..



చిన్నారులతోపాటు పెద్దల్లో సెల్ఫ్ మెడికేషన్ ప్రమాదకరం. ఒకసారి డాక్టరు సూచించిన మందులను నిర్ణీత వ్యవధి దాటిన తర్వాత తరచూ వాడడం వల్ల దుష్ప్రభావం చూపే అవకాశాలు అధికం. వైద్యులు ఏదైనా మందును సూచించినప్పుడు మోతాదు ప్రకారం వాడాలి. చిన్నారుల సిరప్‌లు, డ్రాప్స్‌ను తెరిచిన తర్వాత 21 రోజుల్లోగా వాడాలి. ఆ తర్వాత వాడితే ఇబ్బందికరమే. వైద్యుల సలహా లేకుండా మందులు వాడడం వల్ల చిన్నారుల్లో మెటబాలిజం దెబ్బతినే ప్రమాదముంది. చిన్నారులకు ఏ ఇబ్బంది ఉన్నా వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ విజయశేఖర్, చంటి పిల్లల వైద్య నిపుణుడు, ప్రభుత్వాసుపత్రి కాకినాడ

### మూడు రోజులు చూడాలి



దగ్గు, జలుబు వంటి ఇన్ఫెక్షన్లు వస్తే తక్షణమే మందులు అవసరం లేదు. కాచి చల్లార్చి గోరు వెచ్చగా తేనె నీళ్ల (ఏడాది దాటాక), తేనె లవంగం నీళ్ల, ఆవిరి పట్టడం వంటివి చేయవచ్చు. మూడ్రోజుల తర్వాత కూడా దగ్గు వస్తుంటే డాక్టరును సంప్రదించాలి. అవసరం అనుకుంటే వారి పర్యవేక్షణలోనే తగు మోతాదులో మందులు వాడాలి. డెక్స్ట్రామెథార్ఫన్ నాలుగేళ్లలోపు పిల్లలకు వాడకూడదు. మందుల వినియోగంలో జాగ్రత్తగా ఉండాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదం.

- కొండా ఉమా శివరామకృష్ణ, చిన్న పిల్లల వైద్య నిపుణుడు, రాజమండ్రి

## ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్ పరీక్షలు

అమలాపురంటౌన్, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పరీక్షల టైంటేబుల్‌ను ఇంటర్మీడియట్ విద్యామండలి విడుదలచేసినట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు శనివారం తెలిపారు. 2026 ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మార్చి 24వ తేదీ వరకు ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ముందుగా జనవరి 21న నైతికత-మానవ విలువలు, 23న పర్యావరణ విద్య పరీక్షలు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతాయి. జనవరి 27వ తేదీ నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు జనరల్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సమగ్ర శిక్షా ఒకేషనల్ ట్రేడ్ పరీక్ష ఫిబ్రవరి 13వ తేదీన జరుగుతుంది. హోలీ, ఉగాది, రంజాన్ పర్వదినాల సెలవుల్లో ఏవైనా మార్పులు ఉంటే టైమ్ టేబుల్ సవరణ జరుగుతుందని ఇంటర్మీడియట్ విద్యామండలి ముందుగానే తెలిపిందన్నారు. పరీక్షల టైమ్ టేబుల్ విడుదలైన సందర్భంగా తల్లిదండ్రులు, సంరక్షకులు, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ చదివించాలని సోమశేఖరరావు కోరారు.

## శనిత్రయోదశికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామి వారి ఆలయానికి శనివారం శనిత్రయోదశి కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనములకు తైలాభిషేకాలకు క్యూకట్టారు. వ్యవసాయ శాఖ కమిషనరు డి.హరిత కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఇక వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.5,26,197 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్లు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

## స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రకు రాష్ట్రస్థాయిలో లొల్ల ఎంపిక

- జిల్లాస్థాయిలో 16 కేటగిరిల్లో 49 అవార్డులు
- ప్రకటించిన కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం,అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు రాష్ట్రస్థాయిలో ఒకటి, జిల్లాస్థాయిలో 49 అవార్డులు లభించాయి. జిల్లాలో 16 కేటగిరిల్లో 49 అవార్డులను ప్రభుత్వం ప్రదానం చేయనుందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామానికి అవార్డు లభించిందని, ఇది ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. జిల్లాకు వచ్చిన గుర్తింపులో భాగస్వామ్యమైన ప్రతీ ఒక్క సంస్థ, గ్రామం, పాఠశాల, ఆసుపత్రి, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తల భాగస్వామ్యంతో సాధ్యమైందని పేర్కొన్నారు. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమాలు రాష్ట్రస్థాయిలో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అవార్డులు సాధించిన వివరాలను కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు.

### జిల్లాస్థాయిలో 49 అవార్డులకు ఎంపిక..

రాష్ట్రస్థాయిలో ఆత్రేయపురం మండలం లొల్ల పంచాయతీ అవార్డు పొందింది. జిల్లాస్థాయిలో ఉత్తమ స్వచ్ఛ హరిత అంబాసిడర్లుగా ఉండ్రాజవరపు మారేష్ (దంగేరు), కొల్లు అర్జునరావు (పాలగుమ్మి), యార్లగడ్డ వెంకాయమ్మ (సాకుర్రు), చంద్రమళ్ల చంద్రరావు (పాలతోడు), పెయ్యల వెంకట్రావు (భట్నవిల్లి)లకు లభించాయి. ఉత్తమ స్వచ్ఛత ఎన్జీవో సంస్థగా వశిష్ఠ లయన్స్‌క్లబ్ (అమలాపురం), ఆక్సిజన్ అసోసియేషన్ (మామిడికుదురు), సేవ్ నేచుర్ మహిళా సంఘం (కేశనకుర్రు)లకు లభించాయి. ఉత్తమ స్వచ్ఛతా యోధులుగా రేలంగి సత్యనాగేశ్వరరావు (అమలాపురం), యార్లగడ్డ సుబ్బాయమ్మ (అమలాపురం), గొట్టా సూరిబాబు (మండపేట), వి.దుర్గారావు (మండపేట), వడ్డాది సతీష్‌బాబు (రామచంద్రపురం)లకు లభించాయి. స్వచ్ఛ అంగన్‌వాడీలుగా అమలాపురం అంగన్‌వాడీ, జొన్నాడ, మలికిపురం, మారేడుపాక, పాతగన్నవరం అంగన్‌వాడీలకు లభించాయి. స్వచ్ఛ బస్‌స్టేషన్‌గా రామచంద్రపురం బస్‌స్టేషన్‌కు లభించింది. స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలుగా కలెక్టరేట్ (అమలాపురం), మండపేట మున్సిపాలిటీ, ఎంపీడీవో కార్యాలయం (కొత్తపేట) లకు లభించాయి. స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా దంగేరు, కొమరగిరిపట్నం, పాలతోడు, శివకోడులకు లభించాయి. స్వచ్ఛ ఆసుపత్రులుగా అల్లవరం, బెండమూర్లంక పీహెచ్‌సీలు, జీహెడీ గోపాలపురం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కొత్తపేటలకు లభించాయి. స్వచ్ఛ హాస్టళ్లుగా సోషల్ వెల్ఫేర్ బాలికలు (రాజోలు), ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర హాస్టల్ (రాజోలు)కు లభించాయి. స్వచ్ఛ పరిశ్రమలకు అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ గోపాలపురం, ఎన్ఏసీఎల్ ఇండస్ట్రిలిమిటెడ్ ఈతకోట, స్వచ్ఛ మున్సిపాలిటీలుగా మండపేట, స్వచ్ఛ గురుకుల పాఠశాలగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల (గోడి), స్వచ్ఛ రహిత బజార్లుగా రామచంద్రపురం రైతుబజార్, స్వచ్ఛ పాఠశాలలుగా ఎంపీపీ ఎంపీఎస్ మడికి, జీహెచ్ఎస్ ఆలమూరు, జేఎన్ ఎంపీఎల్ కొంకాపల్లి (అమలాపురం),ఎస్ఐజీఎంపీఎల్ సీహెచ్ఎస్ రామచంద్రపురం, జడ్పీహెచ్ఎస్ రాయవరంనకు లభించాయి. స్వచ్ఛ ఎస్ఎల్ఎఫ్ఎస్‌గా భాను ఎస్ఎల్ఎఫ్ కొత్త హరిజనపేట (రామచంద్రపురం), ఐశ్వర్య ఎస్ఎల్ఎఫ్ అంకంవారి స్ట్రీట్ (రామచంద్రపురం), ఎం.అగ్రహారం, మల్లాయిపాలెం, ముమ్మిడివరంకు లభించాయి. స్వచ్ఛ గ్రామ సంస్థలుగా అమలాపురం రూరల్ మండలం బండారులంక, ముమ్మిడివరం మండలం గేదెల్లంక, రామచంద్రపురం మండలం కందుపాలెం, అమలాపురం మండలం నల్లమిల్లి, రాజోలు మండలం శివకోడులకు జిల్లాస్థాయిలో మొత్తం 49 అవార్డులు లభించాయి.



సఖినేటిపల్లి రేవులో పంటు రాకపోకలు ప్రారంభం

వాడపల్లికి పోటెత్తిన భక్తజనం 7

# 'ఆటో డ్రైవర్ల సేవ'లో ప్రజాప్రతినిధులు..



కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో ఆటో కార్మికులకు చెక్కు అందజేస్తున్న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ. చిత్రంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆటో కార్మికులకు చెక్కు అందజేస్తున్న రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



ఆటోడ్రైవర్లకు ఆర్థికసాయం పంపిణీ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ నాయకులు

# హర్షాతిరేకాలు

'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు సభలు నిర్వహించి ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేశారు. కూటమి ప్రభుత్వం తమకు ఆర్థిక భరోసా ఇచ్చిందని పలువురు డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. వారి సంతోషం వారి మాటల్లోనే....


కాకినాడలో ఆనందం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

## ఆటోవాలాలకు ఎంతో మేలు

**శెట్టి శ్రీను, వేట్లపాలెం, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా**


మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య 20 శాతం నుంచి 30 శాతం తగ్గింది. అంతకు ముందు నిత్యం రూ.700 నుంచి రూ.1,000 వచ్చేది. ఇప్పుడు రూ.500-రూ.700 మధ్య మాత్రమే వస్తోంది. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ఆటోవాలాలకు ఎంతో మేలు చేకూరుస్తుంది.

## కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

**పటాన్ బాజీ, లక్ష్మీపురం, దేవరపల్లి మండలం, తూర్పు గోదావరి జిల్లా**


ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టడంతో ఆటో డ్రైవర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గతం ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు రూ.10వేలు ఇస్తే కూటమి ప్రభుత్వం మా ఖాతాల్లో రూ.15వేలు జమ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు.

## సీఎం మా కష్టాన్ని గుర్తించారు

**ఆర్.గిరీష్ కన్న, పోతవరం, నల్లజర్ల మండలం, తూర్పు గోదావరి జిల్లా**


గత ప్రభుత్వంలో ఏడాదికి కేవలం రూ.10వేలు ఇచ్చే వారు. అవి ఆటో ఫిట్‌నెస్‌కి సరిపోయేవి కావు. రూ.5వేలు అప్పు చేయాల్సి వచ్చేది. సీఎం చంద్రబాబు మా కష్టాన్ని గుర్తించి ఏడాదికి రూ.15వేలు ఇస్తామని ప్రకటించారు.

## ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుంది

**మోకా వెంకటేశ్వరరావు, అయినాపురం, ముమ్మిడివరం మండలం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా**


మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల మాకు కొంత నష్టం కలిగింది. రూ.15వేలతో ఆ నష్టం భర్తీ అవుతుంది. ఆటో కార్మికులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇంది ఎంతో ఉపయోగం. సొమ్ము అవసరమైనప్పుడు ప్రైవేటు ఫైనాన్సర్ల వద్దకు వెళ్లాల్సిన అవసరం తప్పింది.

## ఎంతో ఆనందంగా ఉంది

**ములికి సూరిబాబు, తుని ఏరియా ఆటో యూనియన్ ప్రెసిడెంట్**


ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పకపోయినా, ఆదుకుంటామని ఎటువంటి హామీ ఇవ్వకపోయినా ప్రభుత్వం ఆటో డ్రైవర్ల కష్టాలను గుర్తించి ఆర్థిక సహాయం అందజేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. కూటమి ప్రభుత్వానికి అన్ని విధాలా రుణపడి ఉంటాం.

## కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది

**గెడ్డం శేఖర్‌బాబు, మలికిపురం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా**


ఈ పథకం మాకు ఎంతో తృప్తి ఇచ్చింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంది. సూపర్-6 పథకాల్లో 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం లేకపోయినప్పటికీ మా ఇబ్బందులను గమనించి రూ.15వేలు కేటాయించడం ఆనందంగా వుంది.

## చిన్నచిన్న మరమ్మతులు చేయించుకుంటాను

**కోపెల్ల శ్రీను, తీపర్రు, పెరవలి మండలం, తూర్పు గోదావరి జిల్లా**


రూ.15వేలతో నా ఆటోకు అవసరమైన చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తాను. ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవడానికి ఉపయోగిస్తాను. ప్రభుత్వం ఈ సాయం చేయకపోతే బయట అప్పు చేసి వాటిని చేయించాల్సి వచ్చేది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు రుణపడి ఉంటాం.

## కూటమి ప్రభుత్వం అండ

**పైల వీరబాబు, ఏలేశ్వరం, కాకినాడ జిల్లా**


స్త్రీ శక్తి పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఆటోపై ఆధార పడి జీవనం సాగిస్తున్న మాకు ఇబ్బందులు తలెత్తాయి. స్థానిక నాయకులు మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని ప్రారంభించడం చాలా సంతోషదాయకం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక భరోసాను, అండను ఎన్నటికీ మరువలేం.

## థాంక్యూ... సీఎం సార్

**చౌదరి, కాకినాడ పాత బస్టాండ్**


ఆటోయే మా కుటుంబానికి జీవనాధారం. గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ఎంతో ఇబ్బంది పడేవాళ్లం. అప్పట్లో ఇచ్చిన రూ.10వేలు కూడా ఆటోల మరమ్మతులకే సరిపోయేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్ల మరమ్మతులు చేపట్టడంతో ప్రయాణం సాఫీగా సాగుతోంది. రూ.15వేలు సాయం అందించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు.

## ఒటన్ నొక్కగానే డబ్బులు పడ్డాయి

**ఆర్.రాజు, కాకినాడ**


సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన మాట మాట నిలబెట్టుకున్నారు. అమరావతిలో బటన్ నొక్కగానే ఇక్కడ వెంటనే నా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమయ్యాయి. చాలా ఆనందించాను.

## మా కుటుంబాల్లో వెలుగులు

**బూరుగు కల్యాణ్, క్రాపచింతలపూడిపాలెం, ముమ్మిడివరం మండలం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా**


ఆటో డ్రైవర్ల సేవలో పథకం చాలా బాగుంది. ఎంతో మంది ఆటోవాలాల జీవనోపాధికి ఇది మేలు చేస్తుంది. ఎన్నికల ముందు ఎటువంటి హామీ ఇవ్వకపోయినా మా ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకున్నారు. మా కుటుంబాల్లో వెలుగులు నింపుతాయి.

# వాడపల్లికి పోటెత్తిన భక్తజనం

**రూ.53.41 లక్షల ఆదాయం**

ఆత్రేయపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామికి అర్చకులు సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. భక్తులు స్వామివారి తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తులభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. వివిధ సేవల ద్వారా స్వామికి రూ.53.41 లక్షల ఆదాయం లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


శ్రీవేంకటేశ్వరస్వామి


ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తులు

## వాలీబాల్ క్రీడాకారుడు పూజలు

వెంకన్న ఆలయంలో శనివారం తాడిపూడికి చెందిన అంతర్జాతీయ వాలీబాల్ అండ్ బీచ్ వాలీబాల్ క్రీడాకారుడు ముదునూరి చలపతి రామకృష్ణంరాజు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆయన తెలంగాణ రాజధానిలో కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు స్వామి చిత్రపటం అందజేశారు. అలాగే ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.


క్రీడాకారుడికి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

# వాస్తవికతకు అద్దం పట్టేలా జోగేష్ కవిత్వం

**లిథియా పూలు-సలామీ అఖాతం కవితా సంపుటి ఆవిష్కరణ**


లిథియా పూలు-సలామీ అఖాతం కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కవులు

అమలాపురం టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్వీయ అనుభూతితో బడుగు భాస్కర జోగేష్ రాసిన కవిత్వంలో సౌందర్య దృష్టికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని.. ప్రాపంచిక, వాస్తవికత పట్ల అంతే ఎరుకతో రచన సాగించారని ప్రముఖ కవి, రచయిత నామాడి శ్రీధర్ పేర్కొన్నారు. కవి, తన బాల్య, యవ్వన కాలాల జ్ఞాపకాలతో పాటు సామాజిక ఘటనలు, రాజకీయ పరిణామాలను కవిత్వీకరించారని ఆయన ప్రశంసించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని బార్ అసోసియేషన్ భవనంలో శనివారం కవి భాస్కరజోగేష్ రచించిన కవితా సంపుటి 'లిథియా పూలు-సలామీ అఖాతం' ఆవిష్కరణ సభలో ఆయన పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించి సభకు అధ్యక్షత వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి అజయ్ కుమార్ చేతులమీదుగా జోగేష్ మాతృమూర్తి ఈశ్వరమ్మకు తొలి ప్రతిని అందించారు. ప్రధాన వక్త, కవిసాహిత్య విమర్శకులు సుంకర గోపాల్ మాట్లాడుతూ లిథియా పూలు-సలామీ అఖాతం కవిత్వ సంపుటిలో అనుభూతి, భావుకత, సామాజిక పరిణామాల చిత్రీకరణ ఉందన్నారు. ఒక తాత్విక ధార్మిక దృక్పథంతో పాటు గాఢత స్పష్టత ఉన్న అరుదైన కవిగా జోగేష్‌ను కొనియాడారు. మరో రచయిత అవధానుల మణిబాబు మాట్లాడుతూ జోగేష్ కవితా సంపుటిని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు మధునాపంతుల సత్యనారాయణమూర్తి, దాట్ల దేవదానంరాజు, కోదూరి రామరాజు, ఎంఎస్ సూర్యనారాయణ, మిరప మహేష్, మోకా రత్నరాజు తదితరులు ఆత్మీయ వచనాలు చెప్పారు. కవి బడుగ భాస్కరజోగేష్ తన కవితా నేపథ్యాన్ని వివరించారు. మధునాపంతుల చలపతి, ముక్కామల చక్రధర్, చెల్లి రవిగౌరన్, ముత్యాల శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాదులు డీబీ లోక్, ఎండీ ఆజామ్, అడపా ప్రసాద్, నంబూరి మూర్తి, కుడుపూడి అశోక్, వనుము చంద్రశేఖర్, నందెపు శ్రీనివాస్, చిరంజీవి పాల్గొన్నారు.

## శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డులో కారుపర్తికి అవకాశం

అంబాజీపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రుకు చెందిన ప్రముఖ సిద్ధాంతి కారుపర్తి నాగ మల్లేశ్వరరావుకు అవకాశం లభించింది. ఈ మేరకు ప్రభుత్వం ప్రకటించిన ఉత్వర్వులో ఆయన్ని ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమించారు. గత 35 ఏళ్లుగా ఆయన సిద్ధాంతిగా ఉన్నారు. పుల్లేటికుర్రులోని ఆలయాన్ని సొంతంగా నిర్మించిన ఏటా వైభవోపేతంగా పూజలు నిర్వహిస్తా రు. అలాగే ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కుటుంబానికి ఆయన వ్యక్తిగత సిద్ధాంతి. అలాగే ఆయన పంచాగాలు రూపొందించి దేశ, విదేశాల్లో ఆవి ష్కరించారు. ఆయన ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.


కారుపర్తి నాగ మల్లేశ్వరరావు

## నేడు ఉమ్మడి జిల్లా దివ్యాంగుల పారా స్విమ్మింగ్ పోటీలు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా దివ్యాంగుల పారా స్విమ్మింగ్ పోటీలు జరగనున్నాయి.ఏలూరులో ఈనెల 12న 7వ రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2025 జరగనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆసక్తి గల దివ్యాంగ క్రీడాకారులు ఆదివారం ఉదయం 9 గంటలకు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని స్విమ్మింగ్ పూల్ వద్దకు హాజరుకావాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ కాకినాడ జిల్లా ఇన్చార్జి ప్రెసిడెంట్ వి.రామస్వామి, సెక్రటరీ సాబీర్ కోరారు. మరిన్ని వివరాలకు 9390131777, 8121394478లో సంప్రదించాలని కోరారు.

**అండర్ 14, 17 స్కూల్ గేమ్స్ సెలక్షన్స్**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్ 14, 17 స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌లో భాగంగా కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో శనివారం రెజ్లింగ్, స్క్వాష్, మోడరన్ పెంటాతలను విభాగాల్లో బాల, బాలికల ఎంపికలు జరిగాయి. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కే.శ్రీనివాసరావు, పి.సుధారాణి పర్యవేక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి మాచరిరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు, సీనియర్ పీడీలు ఎల్ జార్జ్, కె.పట్టాభిరామం వై.బంగారు రాజు, టైక్వాండో జిల్లా కార్యదర్శి అరుణ్ రావు ఆధ్వర్యంలో ఈ ఎంపికలు నిర్వహించారు. అదేవిధంగా రాజా ట్యాంక్‌లో ఉన్న స్కేటింగ్ రింగ్‌లో స్కేటింగ్ అండర్ 14, 17 బాల బాలికల ఎంపికలు జరిగాయి.

## 7న ఉమ్మడి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

కాకినాడ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 7న జరుగుతుందని జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు తెలిపారు. కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి నాలుగు జిల్లాల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. ఈ ఏడాది జూలై 2, సెప్టెంబరు 10 తేదీల్లో నిర్వహించిన సమావేశాల యాక్షన్ టేకెన్ రిపోర్టు కూడా తీసుకురావాలని శనివారం ఒక ప్రకటనలో ఆయన కోరారు.

## సీనియర్ జర్నలిస్టు అడపా అప్పారావు కన్నుమూత

అమలాపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలం పాత్రికేయునిగా పనిచేసిన అడపా అప్పారావు(78) శనివారం రాత్రి ఆకస్మికంగా మృతిచెందారు. కొన్నిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అమలాపురంలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. 'ఆంధ్రజ్యోతి' సహా వివిధ దినపత్రికల్లోను, టీవీ చానళ్లలోను కాకినాడ కేంద్రంగా ఆయన పనిచేశారు. ఐదు దశాబ్దాల పాటు పాత్రికేయరంగానికి అప్పారావు సేవలందించారు. ఆయన మృతికి వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు. అమలాపురం మండలం రోళ్లపాలెంలో అప్పారావు భౌతికకాయాన్ని ఉంచారు.


అప్పారావు (ఫైల్)

# ప్రకృతి వ్యవసాయం ప్రశంసనీయం

**తూర్పుగోదావరి జిల్లా కాపవరం, ముక్కామలలో బ్రెజిల్ ప్రతినిధుల బృందం పర్యటన**


కాపవరంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలిస్తున్న బ్రెజిల్ ప్రతినిధులు


ముక్కామలలో డ్రోన్‌తో ప్రకృతి కషాయాల పిచికారి పరిశీలిస్తున్న బృందం సభ్యులు

కొవ్వూరు/పెరవలి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను బ్రెజిల్, యుఏఈ, శ్రీలంకకు చెందిన 30 మంది నిపుణుల బృందం సందర్శించారు. జర్మనీకి చెందిన అంతర్జాతీయ వ్యాపారవేత్త, నౌసంస్థ సీఈవో వాల్టర్ లింక్, బ్రెజిల్ మంత్రిత్వశాఖకు చెందిన వివియన్, సాండ్రో, 30 మంది ప్రతినిధుల బృందం పర్యటించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలించి సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాకు విచ్చేసిన విదేశీ ప్రతినిధుల బృందాన్ని రెండు గ్రూపులుగా విభజించారు. ఒక బృందం పెరవలి మండలం ముక్కామల, రెండో బృందం కొవ్వూరు మండలం కాపవరం గ్రామాల్లో పర్యటించి రైతు సాధికార సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా బాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) వినూత్న నమూనాలను పరిశీలించారు. ముక్కామలలో అన్నపూర్ణా నాన్ పెస్టిసైడల్ మేనేజ్‌మెంటు షాపు వద్ద ప్రకృతి వ్యవసాయ 9సార్వత్రిక సూత్రాల చక్రాన్ని సందర్శించారు. అనంతరం ఘనజీవామృతం, కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం తయారీ విధానం, వినియోగం, నిల్వ చేయడంపై అవగాహన కల్పించారు. జి.వెంకటేశ్వర్లు నిర్వహిస్తున్న డ్రమ్ సీడర్‌తో వరి సాగును వీక్షించారు. కలుపునియంత్రణ, కూలీలఖర్చు తగ్గింపు, సమయపాలన వంటి ప్రయోజనాలను అడిగితెలుసుకున్నారు. పి.రామకృష్ణ నిర్వహిస్తున్న పామ్‌ఆయిల్, వక్క, అరటిసాగు నమూనాలను పరిశీలించి ఉత్పత్తులకు మార్కెట్ డిమాండ్‌ను అడిగి తెలుసుకున్నారు. రెండో బృందం కాపవరంలో ప్రకృతి వ్యవసాయం 9సార్వత్రిక సూత్రాల చక్రం, వాటి అమలును పరిశీలించారు. 13 ఎకరాల హార్టీకల్చర్ పాలీక్రాపింగ్ క్షేత్రాన్ని సందర్శించారు. వ్యవసాయ సూత్రాలను అనుసరించడం, సౌరశక్తి వినియోగం ద్వారా చీడపీడల నియంత్రణలో ఆధునిక సాంకేతికతను ప్రయోగించడం, పంట వైవిధ్యంతో సస్యశ్యామలంగా కనిపిస్తున్న పొలం అడవిని తలపిస్తుందని బృందం సభ్యులు ప్రశంసించారు. సైన్స్ అండ్ అకాడమీ థీమాటిక్ లీడ్ సుధాకర్ నేతృత్వంలో ప్రతినిధులు రైతు శాస్త్రవేత్తలతో సమావేశమయ్యారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమై ప్రకృతి వ్యవసాయాన్ని కొనసాగించడంలో వారి పాత్రను ప్రశంసించారు. ధర్మవరంలో గోపాలకృష్ణ ఎనీ టైం మనీ నమూనా, వీర మణికంట డ్రం సీడర్ వరిసాగును సందర్శించారు. కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాదవరావు, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## సఖినేటిపల్లి రేవులో పంటు రాకపోకలు ప్రారంభం

అంతర్వేది, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి- నర్సాపురంలో రేవులో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి పంటు రాకపోకలు పునఃప్రారంభించారు. ఇటీవల వరదల కారణంగా గత వారం రోజులుగా పంటు రాకపోకలు నిలుపుదల చేశారు. వరద ఉధృతి తగ్గడంతో ప్రయాణికుల సౌకర్యార్థం పంట్లను శుభ్రపరిచి రాకపోకలను ప్రారంభించినట్టు నిర్వాహకులు తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే సఖినేటిపల్లి రేవు రాకపోకలు నిలిచిపోవడంతో చించినాడ వంతెన మరమ్మతులు జరుగుతుండగా భారీ వాహనాలకు అనుమతులు లేకపోయినా ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు, చిన్నకార్లు,బాటసారులకు అనుమతులున్నాయి.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

ఆలమూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానఅగ్రహారం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ అందించిన సమాచారం ప్రకారం.. రావులపాలెం మండలం ఊబలంక శివారు తోకలంక గ్రామానికి చెందిన గుత్తుల విజయరాజు(30) నర్సరీ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడిక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం

**రక్షించిన కాకినాడ పోలీసులు**

కాకినాడ క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు భారమవ్వకూడదని తనువు చాలించాలనుకుంది ఆ తల్లి. మృత్యువుకు దగ్గరగా వెళ్తున్న పోలీసులు రక్షించి కుటుంబీకులకు అప్పగించారు. వివరాలోకి వెళితే.. కాకినాడ ప్రతాప్‌నగర్‌కు చెందిన 58 ఏళ్ల వాసిరెడ్డి లక్ష్మీతులసికి కుమారుడు సుబ్రహ్మణ్యం, కుమార్తె భవాని ఉన్నారు. ఆమె భర్త కొంతకాలం క్రితం మృతి చెందడంతో పిల్లల వద్దే ఉంటుంది. అయితే ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ క్రమంలో కుమారుడు, కుమార్తె కలిసి తల్లిని అప్పుడప్పుడు ఆసుపత్రులకు తిప్పడం, మందులు కొనడం చూసి తనకు తిండి పెట్టడమే కాకుండా, వారిపై అదనపు ఆర్థిక భారం పడుతుందని లక్ష్మీతులసి మనోవేదనకు గురైంది. తాను తనువు చాలిస్తే పిల్లలపై ఆర్థిక భారం లేకుండా ఉంటారని భావించింది. తన కుమారినికి నీకు భారం కాకూడదని.. చనిపోతున్నాను నన్ను క్షమించు అని లేఖ రాసి శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. అనంతరం లేఖను గుర్తించిన సుబ్రహ్మణ్యం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సీఐ మజ్జి అప్పలనాయుడు బృందంతో కలిసి గాలింపు చేపట్టారు. అయితే ప్రతాప్‌నగర్ సమీపంలోని రైలు పట్టాలపై తల పెట్టి ఆత్మహత్యకు పాల్పడేందుకు సిద్ధంగా ఉన్న లక్ష్మీతులసిని రక్షించి ఆమె పిల్లలకు అప్పగించారు. ఆ కుటుంబం పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది. లక్ష్మీతులసిని రక్షించిన సీఐ బృందాన్ని ఎస్పీ జి.బిందుమాధవ్ ప్రత్యేకంగా అభినందించారు.


లక్ష్మీతులసిని రక్షించి అప్పగిస్తున్న సీఐ అప్పల నాయుడు

# అమలాపురం



### ఆలయాల వద్ద అన్నసమారాధనలు

యానాం,అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): దేవీనవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక గోపాల్‌నగర్‌లోని శారదాదేవి ఆలయంలో, దొమ్మేటిపేట కనకదుర్గమ్మ ఆలయం, వరంపేటరాజీవ్‌నగర్‌లోని దుర్గాదేవి ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాలను ప్రభుత్వఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్రారంభించారు.

# ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం





ఐ.పోలవరం: ఆటో డ్రైవర్లకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు, పి.గన్నవరం: చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, మలికిపురం: ఆటో డ్రైవర్లకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

- ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు
- ఆటో డ్రైవర్లకు చెక్కుల పంపిణీ

ఐ.పోలవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం అందించి శ్రమజీవుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తన నిబద్ధతను చాటుకున్నారని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. ఆటో డ్రైవర్ల సేవా కార్యక్రమంలో భాగంగా మురమళ్ళలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. తొలుత పాతయింజరం జీఎంసీ బాలయోగి విగ్రహం నుంచి 300 ఆటోలతో మురమళ్ళ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ఆటో నడిపి డ్రైవర్లన ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ కార్యదర్శులు నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, నాయకులు దాట్ల పృథ్వి, సాగిరాజు సూరిబాబురాజు, కాకర్లపూడి రాజేష్, గొలకోటి దొరబాబు, పొద్దోకు బాలు, చెల్లి అశోక్, కాకర్లపూడి బుజ్జి, లంకలపల్లి మునిరాజు, పెంట రవిప్రసాద్, చిక్కాల శ్రీనివాస్, చిలువూరి సుబ్బరాజు, సాకా సీతాదేవి, బీర సత్యకుమారి, సాగి వాసురాజు, ఎంఎస్ఎన్ రాజు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### కూటమితో సంక్షేమ పాలన

మలికిపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సూపర్-6 పథకాలతో పాటు ఆటో డ్రైవర్ల సేవా కార్యక్రమాలను కూడాకూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం మలికిపురంలో రాజోలు నియోజకవర్గంలో 860మందిఆటో, మ్యాక్సీ, మోటారు క్యాబ్ డ్రైవర్లకు మంజూరైన రూ.15వేలు చొప్పున మెగా చెక్కులను అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని ఒక్కొక్కటీ నెరవేరుస్తుందన్నారు. రాజోలు నియోజకవర్గంలో ఆటో డ్రైవర్లకు రూ.1.29కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఎన్ని ఇబ్బందులున్నప్పటికీ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. రాజోలు నియోజకవర్గాన్ని కూడా అన్ని రంగాల్లోను ముందుకు తీసుకువెళుతున్నట్టు ఆయన చెప్పారు. పలువురు ఆటో యూనియన్ నాయకులు కూటమి ప్రభుత్వానికి ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, గొల్లపల్లి అమూల్య, ఎంపీ సత్యవాణి, మంగెన భూదేవి, బందెల పద్మ, గుండుబోగుల పెద్దకాపు, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణి, చాగంటి స్వామి, మోకాపార్వతి, ఈలి శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

### కార్మికుల కష్టాన్ని గుర్తించిన ప్రభుత్వం

పిగన్నవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల కష్టాన్ని గుర్తించి కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. పి.గన్నవరంలో జరిగిన ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ఆటో కార్మికులను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందన్నారు. రూ.15వేలు చొప్పున ఆటో డ్రైవర్ల ఖాతాల్లో జమచేసి కూటమి ప్రభుత్వం ఇచ్చినహామీని నిలబెట్టుకుందన్నారు. డీఆర్డీఏ పీడీ జైచంద్రగాంధీ మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో గత ప్రభుత్వం 7,500 మందికి రూ.10వేలు చొప్పున అందించిందని, కూటమి ప్రభుత్వం 8,470మందికి రూ.15వేలు చొప్పున రూ.12కోట్లు జమ చేసిందన్నారు. తొలుత స్థానిక త్రిరోడ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించిన అనంతరం ర్యాలీగా పోతవరం నుంచి భారీ ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అటవీశాఖ సాంకేతిక సలహాదారుడు పెనమారెడ్డి నాగబాబు, టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, జలవనరుల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, చెల్లుబోయిన గంగాదేవి, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నగరం మార్కెట్ కమిటీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, చిట్టూరి శ్రీనివాస్, దాసరి వీరవెంకటసత్యనారాయణ, మోకా ఆనందసాగర్, చొల్లంగి సత్యనారాయణమూర్తి, బొంతు పెదబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, శేరు శ్రీనుబాబు, మొల్లేటి శ్రీను, గుడాల ఫణి, ఆదిమూలం సూరయ్యకాపు, దొమ్మేటి సాయికృష్ణ పాల్గొన్నారు.

### పవన్‌కల్యాణ్ ఫొటో లేకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం : జనసేన నాయకులు

పి.గన్నవరంలో జరిగిన కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల సేవలో పథకం కరపత్రాలు, చెక్కుపై పవన్‌కల్యాణ్ ఫొటో లేకపోవడంతో అధికారులను జనసేన నాయకులు ప్రశ్నించారు. ఈసందర్భంలో టీడీపీ నాయకులు సైతం ఘర్షణకు దిగడంతో రెండు పార్టీల మధ్య కాసేపు వాగ్వివాదం జరిగింది. దీంతో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కల్పించుకుని సర్దిచెప్పారు.

## బాలబాలాజీస్వామికి విశేష పూజలు



బాలబాలాజీస్వామికి తొలి హారతి ఇస్తున్న అర్చకులు

మామిడికుదురు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం ఆశ్వయుజ మాసం శుద్ధ ద్వాదశిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. శనివారం దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునే అర్చకులు వేదమంత్రోచ్ఛారణల మధ్య సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం 4500మంది దర్శించుకుని నిత్యాన్నదాన పథకంలో 2500మంది అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా శనివారం రూ.3,39,872 ఆదాయం వచ్చిందని సహాయ కమిషర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. నిత్యాన్నదాన పథకానికి వేములదేవికి చెందిన ఆకుల సతీష్-ప్రవీణ దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

## చలో విజయవాడకు తరలిరండి



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ముమ్మిడివరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల7న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి ఉపాధ్యాయులంతా తరలిరావాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పిలుపునిచ్చింది. శనివారం ముమ్మిడివరం బళ్లగేటు సెంటర్‌లోని ప్రాథమిక పాఠశాల వద్ద చలో విజయవాడ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదని, ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను అమలుచేయాలని, 12వ పీఆర్సీ అమలుచేసి మధ్యంతర భృతి విడుదల చేయాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలనే తదితర డిమాండ్లతో చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టినట్టు పేర్కొన్నారు. విజయవాడ ధర్నా చౌక్‌లో రాష్ట్ర స్థాయి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో ఉపాధ్యాయులంతా పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎన్ మునేశ్వరరావు, టి.దుర్గాప్రసాద్, పెన్నాడ శ్రీనివాసరావు, రెడ్డి నాగర్జున, వెంకటేశ్వరరావు, మడికిన నాగభూషణం, పి.హిమబిందు, రాంబాబు, సత్తార్, మోర్త రాజశేఖర్, సిలారపు శ్రీనివాసరావు, చొప్పల రాంబాబులతోపాటు పలువురు పాల్గొన్నారు.

## విజయభేతాళ ఉత్సవానికి టెక్నాలజీతో బందోబస్తు



మాట్లాడుతున్న డీఎస్పీ మురళీమోహన్

అంబాజీపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అంబాజీపేటలో ఈనెల8న జరిగే శ్రీవిజయ భేతాళస్వామి 13వాహనాల ఉత్సవానికి టెక్నాలజీతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో శనివారం శ్రీవిజయ భేతాళ ఉత్సవానికి సంబంధించి ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సీఐ రుద్రరాజు భీమరాజు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సాంస్కృతి సంప్రదాయలతో ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. డ్రోన్లు వినియోగించి అల్లర్లు, ఈవీటిజింగ్ పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ మాట్లాడుతూ ఉత్సవంలో అశ్లీల కార్యక్రమాలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలనారు. తహశీల్దారు చినబాబు, ఎస్ఐలు చిరంజీవి, చైతన్యకుమార్, శివకృష్ణ, ఉత్సవ కమిటీ నిర్వాహకులు దొమ్మేటి రామారావు, శీలం మోహనరావు పాల్గొన్నారు.

### ఉత్సవంపై ఐజీ అశోక్‌కుమార్ ఆరా..

శ్రీవిజయభేతాళ ఉత్సవంపై ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ ఆరా తీశారు. సమావేశం జరుగుతుండగా డీఎస్పీ మురళీమోహన్‌కు ఐజీ ఫోన్ చేసి వివరాలు అడిగితెలుసుకున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

## నేడు ఆదిభేతాళస్వామి 200వ వార్షికోత్సవం



అమలాపురంరూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): అమలాపురం మండలం పేరూరు గ్రామంలో ఈనెల5వ తేదీ ఆదివారం శ్రీజైఆదిభేతాళ స్వామి 200వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తిచేసింది. 1825వ సంవత్సరంలో ప్రారంభమైన ఈఉత్సవాలు ఇప్పటి వరకు నిరాటంకంగా కొనసాగుతున్నాయని ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు బేతాళస్వామి ఊరేగింపు ప్రారంభమవుతుంది. భారీ వాహనాల నడుమ జరిగే ఊరేగింపులో తోట్లపాలెం, చింతపల్లివారిపాలెం, తలుపులుతోట, తాడిగుంటమెరక, లంకతోట, బేతాళస్వామి గుడిసెంటర్, లక్ష్మీనరసింహస్వామివారి కాలనీ, దూడలవారి వీధుల నుంచి బేతాళస్వామి గుడి వద్దకు చేరుకుంటాయి. అనంతరం అక్కడి నుంచి రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వద్దకు ఊరేగింపు చేరుకుంటుంది. అనంతరం భారీ బాణసంచా కాల్పులు కార్యక్రమం వేల మంది సమక్షంలో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. పేరూరు కాపు యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సంఘ అధ్యక్షుడు మొయిల సత్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యుడు మోటూరి సత్తిబాబు, చవ్వాకుల రామకృష్ణ తదితరులు ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు.

### భారీ వర్షం

ముమ్మిడివరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో శనివారం భారీ వర్షం కురవడంతో పలు ప్రాంతాలు నీట మునిగాయి. శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై గంటసేపు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు, పల్లపు ప్రాంతాలు వర్షపు నీటిలో మునిగాయి. ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ముమ్మిడివరంలోని ఆసుపత్రుల వీధి, టెలీఫోన్ ఎక్సైజ్ రోడ్డు, కుమ్మర్లవీధి, ఆర్టీసీ బస్టాండు రోడ్లతో పాటు ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పలు రోడ్లు వర్షం నీటిలో మునిగాయి. భారీ వర్షానికి రోడ్లు, డ్రైనేజీలు ఏకమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలబడి రోడ్లన్నీ జలమయమయ్యాయి.

### కామాక్షీ పీఠంలో చండీ యాగం

అమలాపురం టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని శ్రీకామాక్షీ పీఠంలో దేవీ శరన్నవరాత్రులు శనివారంతో వైభవంగా ముగిశాయి. ఈసందర్భంగా చండీ సప్తసతీ పారాయణం ముగియడంతో వైభవంగా చండీ మహాయాగం, పూర్ణాహుతి జరిపారు. పూర్ణదీక్షాపరులు గోవిందవర్జుల దుర్గానాగేంద్రభాస్కర్‌శర్మ, కామాక్షీ పీఠం ఉత్తరాధికారి విఘనస రావిప్రేమ్ చండీయాగాన్ని నిర్వహించారు.పెమ్మరాజు వీరేశప్రసాద్-సుజాత దంపతులు మండపారాధన నిర్వహించారు.

## బోడసకుర్రును ఓఎన్జీసీ అభివృద్ధి చేయాలి



మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, ఓఎన్జీసీ అధికారులు

అల్లవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కేజీ బేసిన్ పరిధిలో అపారమైన చమురు నిక్షేపాలు కలిగిన బోడసకుర్రు గ్రామాన్ని ఓఎన్జీసీ దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని, సీఎస్సార్ నిధులతో మహిళలకు కుట్టు శిక్షణ భవనాన్ని నిర్మించి ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. శనివారం బోడసకుర్రు కంసాలమామిడి వద్ద ఓఎన్జీసీ సీఎస్సార్ నిధులు రూ.10లక్షలతో కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నారన్నారు. ధవళేశ్వరం నుంచి రూ.1500కోట్లతో కోనసీమ నియోజకవర్గాలకు తాగునీటి సరఫరా ప్రాజెక్టు రానుందన్నారు. రూ.3కోట్లతో అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలకు మంత్రి అచ్చెన్నాయుడు త్వరలో శంకుస్థాపన చేస్తారన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాల తీసుకురావడమే లక్ష్యమన్నారు. ఓఎన్జీసీ ఇనస్టలేషన్ మేనేజర్ రామచందు మాట్లాడుతూ ఓఎన్జీసీ సంస్థ సామాజిక సేవలో ముందుందన్నారు. ఓఎన్జీసీ ఐఎం రామచందు, ప్రాజెక్టు రాష్ట్ర ఆర్గనైజేషన్ డైరెక్టర్ పీడీ సుధీర్‌కుమార్ సమక్షంలో ఎమ్మెల్యే ఆనందరావు మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో గౌరీకుమారి, బీజేపీజిల్లా ఉపాధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, అడపా వెంకటేశ్వరరావు, ముత్యాల బాబీ, చింతా శ్రీనివాస్, పచ్చిమాల ఏడుకొండలు, అరవ చంటి, ఎంపీటీసీ దొమ్మేటి శ్రీశాంతిభవానీ, మొయిల గణపతి, రొక్కాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### అమ్మవార్ల ఊరేగింపు

మలికిపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా గ్రామాల్లో అమ్మవార్ల ఊరేగింపు కార్యక్రమాలు డీజే సౌండ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, భాజాభజంత్రీలతో కార్యక్రమాలు నిర్వహించారు.

## సీఎం ఇచ్చిన హామీల అమలుతో అభివృద్ధి పనులు



కాట్రేనికోన,అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు చెయ్యేరు పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు రూ3.56 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుఅన్నారు. శనివారం చెయ్యేరులో రూ.3.56కోట్లతో చేపట్టే 32సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే సుబ్బరాజు, ఎంపీ హరీష్ మాదుర్ శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులకు అనుమతులిచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు చెల్లి సురేష్, పీఏసీసీఎస్ అధ్యక్షుడు త్సవటపల్లి శ్రీను, త్సవటపల్లి నాగు, నంద్యాల వెంకటేశ్వరరావు, ఆకాశం శ్రీను పాల్గొన్నారు.

### టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడిగా చంటి

అల్లవరం, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి):టీడీపీ బోడసకుర్రు గ్రామకమిటీ అధ్యక్షుడిగా అరవ చంటిని నియమిస్తున్నట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రకటించారు.

### క్రీడాకారిణులకు ఎంపీ అభినందనలు



అమలాపురం టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆనంద్ మినీ స్టేడియంలో జరిగిన 35వ రాష్ట్రస్థాయి సీనియర్ సెపక్‌తక్రా క్రీడా పోటీల్లో కోనసీమ జిల్లా మహిళా జట్టు కాంస్య పతకం సాధించినట్టు కోచ్ యాండ్ర గౌతమ్ తెలిపారు. జట్టు క్రీడాకారిణులు డి.రాజేశ్వరి, డి.ప్రియాంక, యిళ్ల లక్ష్మీదుర్గా, విత్తనాల ఉమ బృందం శుక్రవారం సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు జవ్వాది తాతబాబు ఆధ్వర్యంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. క్రీడాకారిణులను ఎంపీ ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. భవిష్యత్తులో రాష్ట్ర జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి స్వర్ణ పతకాలు సాధించేలా మరింత శిక్షణ పొందాలని సూచించారు. క్రీడాకారిణులను ప్రోత్సహించేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. కోచ్ యాండ్ర గౌతమ్, కేతా సతీష్ పాల్గొన్నారు.

### భీమేశ్వర సిద్ధాంతికి సువర్ణ సింహ తలాటం

అమలాపురం రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): బండారులంకకు చెందిన ప్రముఖ పంచాంగకర్త కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతిని తిరుపతిలో శనివారం జరిగిన కార్యక్రమంలో సువర్ణ సింహ తలాటం బహూకరించి ఘనంగా సత్కరించారు. తిరుపతి పుణ్యక్షేత్రంలో అత్యాధునిక వసతులతో శ్రీశ్రీనివాస ఉమారామలింగేశ్వర నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి వాస్తు శిల్పిగా భీమేశ్వరరావు సిద్ధాంతి వ్యవహరించారు. నిత్యాన్నదాన సత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మన దుర్గాప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖుల సమక్షంలో భీమేశ్వరరావు సిద్ధాంతికి సువర్ణ సింహ తలాటం బహూకరించి సత్కరించారు. దేవాంగ సంఘ ప్రముఖులు కాలెపు సత్యనారాయణమూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, మాజీ మంత్రి నిమ్మల కిష్టప్ప, చింతా శంకరమూర్తి, చింతా వీరభద్రేశ్వరరావు,చింతా నరసింహారావు, గుంటు పాండురంగ పాల్గొన్నారు.

### రేపటి నుంచి తపాలా వారోత్సవాలు

అమలాపురం టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల6 నుంచి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అమలాపురం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు, అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీధరం శనివారం తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా ఈనెల6న టెక్నాలజీ దినోత్సవం నిర్వహిస్తామన్నారు. పోస్ట్‌మెన్, డెలివరీ సిబ్బందికి నూరుశాతం ఫలితాలు సాధనకు వర్క్‌షాప్, పోస్టల్‌శాఖ ఉద్యోగులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 7న ఫైనాన్సియల్ ఇన్‌క్యూజన్ డేలో భాగంగా నూతన సేవింగ్స్ ఖాతాలు ప్రారంభిస్తారు. 8న ఫిలాటెలీ, సిటిజన్ సెంట్రిక్ సర్వీసు దినోత్సవంలో భాగంగా ఖాతాదారులకు అవగాహన, విద్యార్థులకు పోటీలు, ప్రదర్శన నిర్వహిస్తారు, 9న ప్రపంచ తపాలా దినోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తారు. 10న కస్టమర్ దినోత్సవం నిర్వహించి తపాలా శాఖ అందించే వివిధ రకాల సేవలపై అవగాహన కల్పిస్తామని వివరించారు.

### రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు వేదవల్లి ఎంపిక



అయినవిల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-17 నెట్ బాల్ పోటీల్లో ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని అప్పారి వేదవల్లి సత్తా చాటి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైంది. ఈసందర్భంగా శనివారం వేదవల్లిని స్థానిక సర్పంచ్ కుడుపూడి శాంతావతి, ఎంపీటీసీ యడ్ల కిరణ్‌బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిమ్మకాయల గణేశ్వరరావు, మోడల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేరేడుమిల్లి సత్యనారాయణ, విద్యాకమిటీ చైర్మన్ యడ్ల లక్ష్మీదుర్గ, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.రమేష్, సీహెచ్ సత్యానందం, కె.వెంకట్రావు, ఉపాధ్యాయులు తోపెల్ల శ్రీనివాసరావు, సలాది పుల్లయ్యనాయుడు, గుబ్బల సాయిశ్రీనివాస్ తదితరులు అభినందించారు.

### ఘనంగా సాయిబాబా జన్మదిన ఉత్సవాలు

మామిడికుదురు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయిబాబా జన్మదిన మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు డాక్టర్ కాశిన ప్రభాకరరావు తెలిపారు. కోనసీమ జిల్లాలో వంద గ్రామాల్లో సాయిబాబా జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామోత్సవంలో స్వామివారి జీవిత చరిత్ర, సప్త సప్తాహాలను 49 గ్రామాల్లో పారాయణాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. శనివారం మగటపల్లి గ్రామంలో నామన నాగేశ్వరరావు ఇంటి వద్ద స్వామివారి జీవిత చరిత్ర, సత్యం శివం సుందరం పారాయణం జరిగింది. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈపారాయణం కార్యక్రమం రావులాల సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేదపారాయణాన్ని ఆలకించారు.

### శెట్టిబలిజ సంక్షేమ సంఘ మండల అధ్యక్షుడిగా రమేష్

రాజోలు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ సంక్షేమ సంఘం రాజోలు మండల అధ్యక్షుడిగా తాటిపాకకు చెందిన బొంతు రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాటిపాక శెట్టిబలిజ సంఘ భవనంలో రాజోలు మండలం శెట్టిబలిజ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం జరిగింది. ఉపాధ్యక్షుడిగా కాండ్రేగుల శ్రీను, ప్రధాన కార్యదర్శిగా చెల్లింగి శ్రీను, కార్యదర్శిగా పితాని రాము, కోశాధికారిగా మామిడిశెట్టి సత్యనారాయణ ఎన్నికయ్యారని రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ తెలిపారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల రాము, ఉపాధ్యక్షుడు బొక్కా ఏడుకొండలు, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, బొక్కా వెంకటేశ్వరరావు, చిట్టూరి గణేశ్వరరావు, గుబ్బల శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

### నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అంతర్వేది, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యానదాన ట్రస్టుకు మలికిపురం మండలం లక్కవరానికి చెందిన మంగెన రాధాకృష్ణమూర్తి-అలివేలుమంగతాయారు దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్‌కు అందించారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

### దేవస్థానానికి కంప్యూటర్ల బహూకరణ

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి కేశవదాసుపాలెం యూనియన్ బ్యాంకు సహకారంతో రెండు కంప్యూటర్లు బహూకరించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్‌కు కంప్యూటర్లను బ్రాంచి మేనేజర్ యు.రవిబాబు అందించారు.

### జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

రాజోలు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈవో ఎన్.మనోహరం ఆధ్వర్యంలో శనివారం జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మనోహరం మాట్లాడుతూ వివిధ రకాల వస్తువులపై జీఎస్టీ శాతాలను కేంద్ర ప్రభుత్వం తగ్గించిందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, పుస్తకాలపై జీఎస్టీ ఉండదన్నారు. వారోత్సవాల్లో భాగంగా 6, 7 తరగతుల విద్యార్థులకు జూనియర్స్‌గా, 8, 9, 10 తరగతుల విద్యార్థులను సీనియర్స్‌గా వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ఎంఈవో అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ లీలావతి, ఉపాధ్యాయులు ఎం.గణపతి, ఎ.రామలింగేశ్వరరావు, సీహెచ్‌వీడీ ప్రసాద్, ఎ.కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

### జీఎస్టీ తగ్గుదలతో ప్రజలకు మేలు

మలికిపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం జీఎస్టీని తగ్గించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం మలికిపురం సెంటర్ నుంచి ఏఎఫ్‌డీటీ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. వ్యాపారస్తులకు కరపత్రాలు అందజేశారు. టీడీపీ ఇన్‌చార్జి అమూల్య, శ్రీనివాస్, ఎంపీపీలు శ్రీదుర్గ, సత్యవాణి, మంగెన భూదేవి, అడబాల యుగంధర్, చాగంటి స్వామి, గుండుబోగుల పెదకాపు, ముప్పర్తి నాని, గుబ్బల ఫణి, దిరిశాల బాలాజీ పాల్గొన్నారు.

### రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మూడో దశ భూరీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ సూచించారు. చిరతపూడి, కె.పెదపూడి గ్రామాల్లో రీసర్వేపై అవగాహన సదస్సులు నిర్వహించారు. రీసర్వే ప్రక్రియను అధునాతన టెక్నాలజీ శాటిలైట్ రోవర్స్‌ను ఉపయోగించి చేస్తున్నామన్నారు. చిరతపూడి, కె.పెదపూడి గ్రామాలకు రీసర్వేలో భాగంగా గ్రామ సరిహద్దు నిర్దేశించామన్నారు. తహశీల్దారు బి.చినబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కోట బేబిరాణి, వైసీపీ నేతల నాగరాజు, ఆర్ఐ ఏడుకొండలు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### బాలబాలాజీని దర్శించుకున్న అటవీశాఖ సలహాదారు

మామిడికుదురు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారిని అటవీశాఖ రాష్ట్ర ముఖ్య సలహాదారు పెన్నమరెడ్డి నాగబాబు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలుచేశారు. ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయనకు అర్చకులు శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

### రీజెన్సీ జీఎన్ నాయుడుకు సత్కారం

యానాం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కనకాలపేటలో గాస్‌లీక్ బాధితులను శనివారం కాంగ్రెస్ నాయకుడు కాటంశెట్టి రామ్మూర్తి, రీజెన్సీ సంస్థల అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు పరామర్శించారు. ఈసందర్భంగా యువకులు వారికి స్వాగతం పలికి సత్కరించారు. రీజెన్సీ పునఃప్రారంభం కోసం ఆంధ్రా, యానాం ప్రాంతాల ప్రజలు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు. కనకాలపేట ప్రజలు తనపై చూపుతున్న ఆదరణ మరువలేనిదని, ప్రజల్లో మార్పు కనకాలపేట నాంది పలకడం ఖాయంగా కనిపిస్తుందని జీఎన్ నాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యానాం శాఖ అధ్యక్షుడు అర్ధాని దినేష్, గ్రామ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### పౌరహక్కులకు భంగం కలిగితే సమాచారం ఇవ్వండి

ఉప్పలగుప్తం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పౌర హక్కులకు భంగం కల్గితే సంబంధిత అధికారులకు సమాచారం అందించి, న్యాయం కోరవచ్చని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు వెంట్రు సుధీర్ అన్నారు. సర్పంచ్ కడిమి చిన్నవరాజు అధ్యక్షతన శనివారం ఉప్పలగుప్తం పంచాయతీ కార్యాలయం వద్ద పౌర హక్కులపై అవగాహన సదస్సు జరిగింది. తహసీల్దార్ వీఎస్ దివాకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి నెలా పౌర హక్కులపై అవగాహన సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలు అన్యాయానికి గురికాకుండా చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. ఎంపీటీసీ తాళ్ళ లక్షీనరసాయమ్మ, డిప్యూటీ తహసీల్దార్ జి.లలిత పాల్గొన్నారు.

### పాఠశాలకు ఉపకరణాల బహూకరణ

ఉప్పలగుప్తం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు మట్టపర్తి ఉమామహేశ్వరసత్యనారాయణ శనివారం వివిధ ఉపకరణాలను బహూకరించారు. వీటిలో కుర్చీలు, సీలింగ్ ఫ్యాన్లు, కేరమ్‌బోర్డు, క్రికెట్ కిట్, ఆట వస్తువులు తదితరాలు ఉన్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి చిన్నవరాజు, ఎంఈవో సత్తి సత్యకృష్ణ, పీఆర్పీ పినిశెట్టి నాగేశ్వరరావు, సలాది పుల్లారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# భీమేశ్వరాలయంలో ఘనంగా పూర్ణాహుతి

## ముగిసిన దేవీ శరన్నవరాత్రులు

ద్రాక్షారామ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వర ఆలయంలో శనివారం పూర్ణాహుతి కార్యక్రమాలను ఆలయ అర్చకులు, వేదపండిత బృందం ఘనంగా నిర్వహించింది. పూజాధికాలు జరిపిన అనంతరం హోమశాలలో పూర్ణాహుతి జరిపించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ, అర్చకులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు. శనివారం నాటి పూర్ణాహుతితో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకస్వాములు




రాయవరం మండలం వెదురుపాకలో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో ఆలమూరు మండలం మడికిలో ఊరేగింపు

# ఘనంగా అమ్మవారి నిమజ్జనం

రాయవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వెదురుపాకలోని దేవీ సెంటర్ దుర్గాదేవి మండపం వద్ద నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని అమ్మవారి నిమజ్జనాన్ని శనివారం నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించిన అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం జరిపారు. అనంతరం అమ్మవారి నిమజ్జనం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### కోటిపల్లి గోదావరిలో..

**కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఆయా గ్రామాల నుంచి తీసుకువచ్చిన విగ్రహాలను కోటిపల్లి గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. పామర్రు ఎస్‌ఐ ఎస్.కె. జానీబాషా పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని యండగండి, పామర్రు, కుందూరు తదితర గ్రామాల్లో అన్న సమారాధనలు చేశారు.

**ఆలమూరు, (ఆంధ్రజ్యోతి):** ఆలమూరు, మడికి, చెముడులంక, జొన్నాడ, చొప్పెల్ల, చింతలూరు, పెదపళ్ల తదితర గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాలను ఊరేగించిన అనంతరం కాలువలు, గోదావరిలో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్ అధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి):** దేవీ శరన్నవరాత్రి ముగింపు వేడుకల్లో భాగంగా శనివారం అమ్మవార్ల ఊరేగింపు, నిమజ్జనం కార్యక్రమాలను నిర్వహించారు. ఉచ్చిలి విజయదుర్గమ్మ అమ్మవారిని కళాకారుల ప్రదర్శనలు, వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం నిర్వహించారు. వాడపల్లిలో వందలాది మంది భవానీ భక్తులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు.



సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అంగన్‌వాడీలు

# పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కపిలేశ్వరపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కపిలేశ్వరపురం గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ అన్నారు. శనివారం కపిలేశ్వరపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ప్రాజెక్టు అధికారి యు.పూర్ణిమ ఆదేశాల మేరకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.రత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం సూపర్‌వైజర్ ఐ.మాణిక్యం, అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో జె.మల్లిఖార్జునుడు మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నెక్కంటి శ్రీరాంజీ, బలవరెడ్డి సత్తిబాబు, పర్వతిన మురళీకృష్ణ, సచివాలయం సిబ్బంది, కపిలేశ్వరపురం పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నవాబుపేటలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

# చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై దృష్టిపెట్టాలి

ఆలమూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఆదాయాలను పెంచుకోవడానికి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగించుకోవాలని తద్వారా ఆదాయ వనరులు పెరుగుతాయని కొత్తపేట డీఎల్‌డీవో రాజశేఖర్, ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు సూచించారు. మండలంలోని సంధిపూడి, నవాబుపేట గ్రామాల్లో శనివారం వారు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. సంపద కేంద్రాల నిర్వహణపై స్థానిక సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లతో వారు మాట్లాడారు. ఆదాయ వనరులు పెంపుదలకు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని వారు సూచించారు. కార్యక్రమంలో సంధిపూడి, నవాబుపేట సర్పంచ్‌లు తోట భవానీ, సూరంపూడి ముత్యాలమ్మ, పంచాయతీ కార్యదర్శులు ఎస్.వీర్రాజు, వి.హనుమ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## కాలుష్య రహిత సమాజానికి
# ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

రాయవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని లొల్ల విశ్వమానవత సంస్థ అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి పిలుపునిచ్చారు. శనివారం రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి కోనసీమ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యం ఎక్కువగా వెలువడే వాహనాలు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించడంతో పాటు సైకిల్ వినియోగం పెంచాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి ఏర్పడే ముప్పును ఆయన వివరించారు. విద్యార్థులకు యోగా, ధ్యానం, సూర్య నమస్కారాలు సాధన కలిగే ప్రయోజనాలు, అల్పాహారం, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టారు. తొలిరోజు సైకిల్ యాత్ర రాయవరం, లొల్ల అనపర్తి మండలం మహేంద్రవాడ, పొలమూరు మీదుగా అర్తమూరు, కుతుకులూరు గ్రామాల్లో సాగింది. కోనసీమ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సైకిల్ యాత్ర సాగుతుందని ఆయన తెలిపారు.



రాయవరం హైస్కూల్ నుంచి సైకిల్ ర్యాలీ చేపడుతున్న దృశ్యం

# మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

### 7, 8 తేదీల్లో క్రీడా పోటీలు

కె.గంగవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలస్థాయి క్రీడా పోటీలు 7, 8 తేదీల్లో పామర్రు ఉన్నత పాఠశాల ఆటస్థలంలో నిర్వహిస్తున్నట్టు ఎంఈవో ఏ.నాగరాజు తెలిపారు. బాలికలకు 7న, బాలురకు 8న ఉంటాయన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు.



# ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

• ఎమ్మెల్యేలు వేగుళ్ల, బండారు, ఎంపీ హరీష్‌మాధుర్ • ప్రభుత్వ ఆర్థికసాయంపై ఆటో డ్రైవర్ల హర్షాతిరేకాలు




రామచంద్రపురంలో ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్. పక్క చిత్రంలో రావులపాలెంలో ఆటో డ్రైవర్లకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

మండపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో సూపర్ సిక్స్ అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ అన్నారు. మండపేటలో శనివారం మండపేట-ఏడిద రోడ్డులో వున్న ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్ల సేవ కార్యక్రమం నిర్వహించారు. మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ప్రసంగించారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు పలువురు నేతలు రాష్ట్రాభివృద్ధికి మంత్రులు చేస్తున్న కృషిని వివరించారు. నియోజకవర్గానికి సంబంధించి మూడు మండలాలతోపాటు మండపేట మున్సిపాల్టీకి సంబంధించిన ఆటో డ్రైవర్లకు మంజూరైన ఆర్థికసాయాన్ని నేతలు వేగుళ్ల జోగేశ్వరరావు, వేగుళ్ల లీలాకృష్ణ శనివారం అందజేశారు. జీఎస్‌టీ ప్రయోజనాలను వారు తెలిపారు. ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తూ వారిని సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కూటమి నేతలు బీజేపీ కె.సాయి, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్, ఎంపీపీ వాసు, మండపేట రవాణశాఖ అధికారి శ్రీదేవి, మున్సిపల్ కౌన్సిలర్లు, కాళ్లకూరి స్వరాజ్యభవాని ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ఆటో సంఘ నాయకులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేను కలిసిన ఎంపీపీ వాసు:** ఇటీవల మండల ఎంపీపీ ఉండమట్ల వాసు టీడీపీలో చేరారు. శనివారం తొలిసారిగా టీడీపీ పట్టణ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్లను కలిశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని చెప్పారు.

### ఆటో కార్మికులకు ప్రభుత్వం అండ
#### ఎంపీ హరీష్‌మాధుర్

**రామచంద్రపురం(ద్రాక్షారామ)(ఆంధ్రజ్యోతి):** ఆటో కార్మికులకు కూటమి ప్రభుత్వం అం డగా ఉంటుందని ఎంపీ హరీష్‌మాధుర్ అన్నా రు. శనివారం రామచంద్రపురంలో ఆటో డ్రైవర్ల సేవ కార్యక్రమంలో ఎంపీ హరీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక వెల్ల వంతెన వద్ద నుంచి ప్రారంభమైన ఆటో ర్యాలీలో ఎంపీ హరీష్, ఆర్డీవో దేవరకొండ అఖిల, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ నేత వాసంశెట్టి సత్యం, నియోజకవర్గ పరిశీలకుడు కాకినాడ రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఖాకీ చొక్కా ధరించి ఆటో నడిపారు. అనంతరం లయన్స్ కల్యాణ మండపంలో నిర్వహించిన సభలో ఎంపీ మాట్లాడారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 7,709 మంది లబ్ధిదారులకు రూ.11.56 కోట్లు జమ చేస్తున్నామన్నారు. ఆర్డీవో అఖిల మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రవాణశాఖ జిల్లా అధికారి రాజేంద్రప్రసాద్‌తో పాటు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు మాట్లాడారు. అనంతరం ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు కంచుమర్తి బాబూరావు పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో నాటక అకాడమి డైరెక్టరు పెంకె అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ కెవీవీఆర్ రాజు, ఎంపీడీవో రాంబాబు, తహసీల్దార్ మృత్యుంజయరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వుండవిల్లి శివ, ఆయా మండలాల టీడీపీ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీను, మేడిశెట్టి వెంకట రమణ, డాక్టర్ బాబు, ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
#### ఆటో డ్రైవర్ల సేవలో ఎమ్మెల్యే బండారు

**రావులపాలెం, (ఆంధ్రజ్యోతి):** ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలో శనివారం ఆటోడ్రైవర్ల సేవ నిర్వహించారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద నుంచి ఆటో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యానందరావు, బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఆర్డీవో శ్రీకర్, కూటమి నాయకులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్‌తో కలిసి ఆటో నడిపి సందడి చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆర్థికసాయం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 7,709 మందికి రూ.11.56 కోట్లు విడుదల కాగా కొత్తపేట నియోజకవర్గంలో 1,156 మందికి రూ.2.33 కోట్లు వారి ఖాతాల్లో జమ అయ్యిందన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణ రెడ్డి, అయినవిల్లి సత్తిబాబుగౌడ్, గుత్తుల పట్టాభిరామారావు, ఎంపీఐ ఓ.శ్రీనువాసు, టౌన్ సీఐ శేఖర్‌బాబు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దారు ముక్తేశ్వరరావు తదితరులతో పాటు, కూటమి నాయకులు, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కోటిపల్లి పుష్కరాల రేవులో వరద తగ్గడంతో మెట్లపై తేలిన బురద

# తగ్గుముఖం పట్టిన గోదావరి

కె.గంగవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి వద్ద గోదావరి నది ఉధృతి తగ్గుముఖం పట్టింది. పుష్కరాల రేవులో పై మెట్ల నుంచి వరద నీరు తగ్గడంతో మెట్లన్నీ బురదగా మారాయి. శనివారం పలు ప్రాంతాల నుంచి దుర్గాదేవి విగ్రహాలను నిమజ్జనం చేయడానికి వచ్చిన భక్తులు బురద కారణంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



సామాజిక భవన నిర్మాణ పనుల శంకుస్థాపనలో ఎంపీ బోస్ తదితరులు

# సామాజిక భవన నిర్మాణానికి ఎంపీ భూమిపూజ

ద్రాక్షారామ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం శివారు రామనర్సుతోటలో ఎంపీ ల్యాండ్స్ నిధులతో నిర్మించనున్న బీసీ సామాజిక భవన నిర్మాణానికి ఎంపీ బోస్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, ఎంపీపీ అంబటి భవానీ, సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, మాజీ ఏపీఐడీసీ డైరెక్టరు శ్యామ్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రిలే నిరాహారదీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

# చేనేత రంగంపై నిర్లక్ష్యం తగదు

కపిలేశ్వరపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): చేనేత రంగంపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబించడం సరికాదని చేనేత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పంపన రామకృష్ణ అన్నారు. మండలంలోని అంగర శ్రీ గణపతి చేనేత సహకార సంఘం కార్యాలయం వద్ద చేనేత కార్మికుల రిలే నిరాహారదీక్ష శిబిరంలో ఆయన పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చేనేత కార్మికులకు ప్రభుత్వం నుంచి రావల్సిన బకాయిలు రాకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో పడిందన్నారు. చేనేత రంగంపై ప్రభుత్వాలు చూపుతున్న సవతితల్లి ప్రేమ నేతన్నల పాలిట శాపంగా మారిందన్నారు. వారం రోజులుగా చేనేత కార్మికులు చేస్తున్న రిలేదీక్షలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దిగి వచ్చే వరకు ఆందోళనను ఉధృతంగా కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు ఎం.గణేశ్వరరావు, బి.కొండయ్య, శలావీర్రాజు, బల్ల కోటేశ్వరరావు, జి.సత్యనారాయణ; అంగర చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# జీఎస్‌టీ తగ్గుదలపై గ్రామాల్లో అవగాహన

మండపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్‌టీ తగ్గించిన నేపథ్యంలో ప్రజలకు అర్థమయ్యేలా గ్రామస్థాయిలో ఆయా ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మండపేట మండల పరిషత్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక వీవర్స్ కాలనీలో జరిగిన సదస్సులో సూపర్‌సిక్స్, జీఎస్‌టీ తగ్గింపుపై ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో మండపేట మండల డిప్యూటీ ఎంపీడీవో దాసరి శ్రీనువాస్, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనువాస్, కూటమి నాయకులు మేకా జేజిబాబు, పి.వీర్రాజు, సొసైటీ అధ్యక్షుడు ఎర్రబ్బు తదితరులు పాల్గొన్నారు.



ఏడిద వీవర్స్ కాలనీలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి

# జనార్దనస్వామి ఆలయంలో విద్యుత్ మీటరు ఏర్పాటు



జనార్దనస్వామి ఆలయానికి విద్యుత్ మీటరును ఏర్పాటు చేస్తూ పత్రాన్ని అందిస్తున్న డీఈఈ శ్రీధర్

ఆలమూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆలమూరు జనార్దనస్వామి ఆలయంలోని భోజనశాలలో విద్యుత్ మీటరు ఏర్పాటు చేస్తూ మంజూరు పత్రాన్ని శనివారం ట్రాన్స్‌కో మండపేట డీఈఈ ఎస్.శ్రీధర్ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ బైరిశెట్టి రాంబాబుకు అందజేశారు. భోజనశాలలో విద్యుత్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్టు వారు డీఈఈ దృష్టికి తీసుకురావడంతో ఆయన సొంత ఖర్చులతో మీటరు ఏర్పాటు చేయడానికి సిద్ధపడారు. శనివారం ఆయన అనుమతి పత్రాన్ని వారికి అందించారు. కార్యక్రమంలో నాయకులు ఈదల నల్లబాబు, బొబ్బా రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు.



హైకోర్టు జడ్జికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

# ర్యాలి ఆలయంలో పాట్నా హైకోర్టు జడ్జి పూజలు

ఆత్రేయపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం పాట్నా హైకోర్టు జడ్జి జి.అనుపమ చక్రవర్తి కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి వారికి స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనం స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదంలో పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకు సత్కారం

ఆత్రేయపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ర్యాలిలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులను సత్కరించారు. అన్నపూర్ణ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎంపికైన ఐదుగురు ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ మోహిత్, సీత, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫొటోగ్రాఫర్ కుటుంబానికి
# యూనియన్ ఆర్థికసాయం


కొత్తపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న సత్యప్రసాద్ ఇటీవల అకస్మికంగా మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఫొటోగ్రాఫర్స్ జిల్లా యూనియన్ బాధిత కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం అందించింది. శనివారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా బాధిత కుటుంబానికి చెక్కు అందించడమే కాకుండా తనవంతుగా రూ.20వేలు ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంఘీభావంతో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ సంఘ జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు రామారెడ్డి, ఉపాధ్యక్షుడు మనోజ్, జిల్లా కార్యదర్శి దొరబాబు, సంఘ సభ్యులు శ్రీను, రాజు, రమణమూర్తి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## గరల్స్ హైస్కూల్ హెచ్‌ఎంగా
# ఉమ బాధ్యతల స్వీకరణ

ఆలమూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆలమూరు బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా కె.ఉమ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె పశ్చిమ గోదావరి జిల్లా పెరవలి మండలం పిట్లల వేమవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఇక్కడి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన హెచ్‌ఎం ఆగస్టులో ఉద్యోగ విరమణ చేయడంతో ఇక్కడ హెచ్‌ఎం పోస్టు ఖాళీగా ఉంది. గరల్స్ హైస్కూల్ హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన ఉమను పలువురు అభినందించారు.

### వృత్తి విద్యా కోర్సులతో మంచి ప్రయోజనాలు



వృత్తి విద్యా కోర్సులు నేర్చుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆలమూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం వల్ల మంచి ప్రయోజనాలు ఉంటాయని ఆలమూరు ఎంఈవో బి.అప్పాజీ అన్నారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దసరా సెలవులలో పలువురు విద్యార్థులకు ఐటీ, ఐటీఈఎస్‌లలో పది రోజులపాటు శిక్షణ ఇచ్చారు. వీరికి శనివారం శిక్షణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.వీరన్న, వీఆర్వో రాజశేఖర్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఫరీష్‌ఉనిస్సా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.